# "ఆత్మవిశ్వాసంలేని రాజు, అతన్ని కొలిచే మూఢప్రజలు"

(పాత కథలకు క్రొత్త పూతలు)

— శ్రీ ఆచంట —
సూర్యనారాయణమూర్తి

# సీత శాపము

ఆ మళుపుతిరగ్గానే అయోధ్య కనపడీ కనపడకుండా ఉంది. ముందూ వెనుకా అరమైలు అరమైలు దూరాన్ని రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, సైనికులు, చూడ్డానికి వచ్చిన ప్రజలు నడుస్తున్నారు. మధ్యగ సీత, రాముడు, సోదరులు, వాల్మీకి, ఇంతక్రితమే ఎదురుగా వెళ్లి వాళ్లను కలుసుకున్న, వసిష్ఠుడు వస్తున్నారు. వెనకాల హనుమంతుడు, బుజాలమీద కుశలవులిని ఎత్తుకు తీసుకువస్తున్నాడు. అంతా నిశ్శబ్దంగా నడుస్తున్నారు. అందరి చూపులు ఆలోచనలతో నిండిపోయాయి. కంటిరెప్పలు బరువెక్కి సగం సగం వాలిపోయాయి. ఏవేవో భావాలతో నిండి భారంగా ఉన్న తలల్ని అందరూ వంచుకు నడుస్తున్నారు.

సీతకు రాముడుకు మధ్యను ఎవరులేరు. అయినా వాళ్లు ఒకరివంక ఒకరు చూసుకోవాలని ప్రయత్నమేనా చెయ్యడంలేదు. రాముని ముఖం చాలా విచారంగా ఉంది. బొత్తిగా కళావిహీనం అయి పోయింది. ఎంతో నేరంచేసి కప్పిపుచ్చుకుంటూన్న వాడి ముఖంలా ఉంది. అసలే నలుపుగా ఉండే ముఖం, మరీ నలుపెక్కి పోయింది. బెంగతో సీత సన్నగా కృశించి పోయింది. అభిమానంతో తలెత్తుకోలేక పోతోంది. ముఖం అంతా ఎఱ్ఱగా కందిపోయింది. ముఖంలో సౌందర్యం తగ్గలేదు, కాని ఉత్సాహం అడుగంటి పోయింది. ఎన్నెన్నో కష్టాలతో కాయ కాసి పోయింది. రోషంతోటి, ఆవేశంతోటి కళ్లలోంచి నిప్పులు కురుస్తున్నాయి. ఎంతో తెగింపుతో ఎవర్నీ లెఖచెయ్యకుండా వంచినతల రెత్తకుండా ఎదురుగా తదేకంగా రెప్ప వాల్చకుండా చూస్తూంది, లోపలినుంచి పొంగివచ్చే ఆవేశాన్ని క్రింది ప్రెదిమను పైపళ్లతో నొక్కి ఆపుకుంటూంది.

స్వాగతం యివ్వడానికి ఎదురుగా వస్తూన్న అయోధ్యా పౌరులను చూసి వాల్మీకి ఆగాడు. ఆగిన మహామునికేసి రాముడు తలెత్తిచూసి తానుగూడా ఆగాడు. అందరూ ఆగిపోయారు. వెనుకా ముందూ నడిచేసైన్యాలు ప్రజలూ ఆగి పోయారు. ఎదురుగా వస్తూన్న పురజనులు మాటవినబడే దూరాన్ని చేతులు జోడించుకు నిలబడి పోయారు.

అంతా అశోక మోస్తరు నిశ్శబ్దంగా ఉన్న మూలాన్ని నెమ్మదిగా మాట్లాడుతోన్నా, వాల్మీకి మాటలు ఖంగ్‌న వినిపించాయి.

వాల్మీకి: ఇంక నేను దిగడతాను.

రాముడు: అప్పుడే? అప్పుడే వెడతారా? మిగతా కార్యక్రమాన్ని గూడా పూర్తిచేసి మరీ దయచేద్దురుగాని.

వాల్మీకి: మిగితా వాటి కేముంది? నీ పుత్రులు, నీ భార్య, నువ్వు అంతా దైవకృపవల్ల కలుసుకున్నారు. సుఖంగా నగరం చేరుకున్నారు. సౌఖ్యంగా ఉండండి. నేను వెళ్లివస్తా.

రాముడు : అన్నీ తెలిసిన పెద్దలు మీరే ఆలా అంటే ఎల్లా? నా స్వార్థాన్ని చంపుకుని లోకం కోసం నేను చేస్తూన్న వ్రతం ఏవిధంగా నెరవేరింది?

వాల్మీకి : అంటే?

రాముడు : మీకు తెలియకే ప్రశ్నిస్తున్నారా? మీరు చేరదీసి మీ చెంతను యింత కాలం నీడను యిచ్చారన్న సంగతే ఆమె నిష్కళంకాన్ని సాటిస్తుంది. కాని ఒక్క సంగతి మరవకండి. మీరు నాకు స్నేహితులు. నేను రాజును. మనకూ మనకూ అనేక అవసరాలు ఉంటాయి. అందుకని మీరు ఆమెను చేరదీసారని ఎవరేనా అనుకోవచ్చును. అనవచ్చును. కాబట్టి ఆమే స్వంతంగా ఏదేనా నిదర్శన పూర్వకమయిన శబధంచేస్తే మంచిది.

సీత : ఆమె ఒకసారి చేసింది.

వాల్మీకి : సీత మహా పతివ్రత.

రాముడు : సీత పాతివ్రత్యాన్ని నేను కలలోనైనా అనుమానించ లేదు.

సీత : అనుమానించకపోతే యిదంతా ఎందుకు?

రాముడు : ప్రజలు నిన్నుగురించి పూర్తిగా తెలుసుకోవడం కోసం.

సీత : ప్రజలకోసమే అయితే అగ్ని పరీక్ష అయోధ్యలో జరుపవలసింది?

రాముడు : ఇప్పుడు మించిపోయిం దేమిటి? మరొక శపథంచెయ్య వచ్చును.

సీత : అవును, రోజురోజూ చేస్తూఉంటాను. ఒక్కొక్కమూర్ఖుడు ఒక్కొక్కమాట అంటూఉంటే ఒక్కొక్కసారి వనవాసం, నిదర్శన పూర్వకమయిన శపథంచేస్తూ ఉంటాను.

రాముడు : మూర్ఖులో, జ్ఞానులో, ఆ ప్రజలకు నేను రాజును.

సీత : తాను మనస్సులో నమ్మినది ధైర్యంగా చెప్పలేనిరాజు... ఆత్మ విశ్వాసంలేని రాజు-

రాముడు : రాజు ప్రజాభిప్రాయానికి బద్ధుడు.

సీత : ప్రజాభిప్రాయానికా? ప్రజలలో మూర్ఖుల అభిప్రాయానికా?

రాముడు : అందరుప్రజలు రాజుకు సమానులే.

సీత : ఆత్మ విశ్వాసంలేని రాజూ, ఆఆత్మ విశ్వాసంలేని రాజును కొలిచి పూజించే మూఢప్రజలూ - వినండి - శబధం చేస్తున్నా - శపిస్తున్నా - "ఆత్మస్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసంలేని రాముణ్ణి ఎవరు పూజిస్తూ ఉంటారో వాళ్లు ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యంలేక నిర్జీవులై నశించిపోతారు." బ్రతికిఉండి వీళ్ల మధ్య మసలడంకంటె ఆత్మహత్య చేసుకోవడం మెరుగు.

(సీత నిలబడినచోట భూమి రెండు చీలికలుగా విడిపోయింది. చటుక్కున సీత దిగజారింది. భూమి యథాప్రకారం మూసుకుపోయింది.)